క్లుప్తంగా

అల్ట్రా పల్లెవెలుగు బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో శనివారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అల్ట్రా పల్లె వెలుగు బస్సు సర్వీసును ప్రారంభించారు. డిపో మేనేజర్ కె.రమేష్ మాట్లాడుతూ ఎస్.కోట నుంచి విశాఖ కు ఉదయం 8 గంట లకు, 11.45 గంటలకు, తిరిగి విశాఖ నుంచి ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 1.45, 3.45 గంటలకు బస్సు సర్వీ సులు ఉంటాయని చెప్పారు.ఎస్.కోట నుంచి విశాఖకు రూ.65 చార్జీ వసూలు చేస్తామన్నారు.ఎంపీపీ సోమేశ్వర రావు, వైస్ ఎంపీపీ సుధారాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న న్యాయమూర్తి కనకలక్ష్మి

బొండపల్లి: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని గజపతినగరం ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి బి.కనకలక్ష్మి అన్నారు. దేవుపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. బాలిక, మహిళా సంరక్షణ చట్టా లను జడ్జి వివరించారు. అంతకుముందు వసతి గృహంలో సదుపాయాలను పరిశీలించారు. అలాగే విద్యార్థినులతో మాట్లాడి మెనూ ప్రకారం అల్పాహారం, భోజనాలు అందిస్తున్నారా లేదా అని జడ్జి ఆరా తీశారు. కేజీబీవీ సిబ్బందితో పాటు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



పాతకుమ్మరివీధిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ శిరీష

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన చోట మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని పాతకుమ్మరివీధిలో రూ.5 లక్షల జిల్లా పరిషత్ నిధులతో నిర్మించనున్న సిమ్మెంటు రోడ్డు, వీధి కాలువ పనులకు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాలనాయుడు, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దోషుల్ని శిక్షించాలి



మాట్లాడుతున్న దేబార్కి కిరణ్, తదితరులు

వేపాడ: కోల్‌కతాలోని ఆర్జీ కర్ కళాశాలలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు దేబార్కి కిరణ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, వైద్యసిబ్బందికి రక్షణ కల్పించాలని కోరారు. మాలమహానాడు నేతలు బంగారు రమణ, కదారి అప్పారావు, చెలికాని చెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య కార్యాలయ సందర్శన



మండల సమాఖ్య కార్యాలయంలో వీడియో షూట్ చేస్తున్న కేంద్ర బృందం

గంట్యాడ: స్థానిక మండల సమాఖ్య కార్యాలయాన్ని కేంద్రం బృందం(ఎన్ఆర్ఎల్ఎం) సభ్యులు సంజయ్‌గిరి, ముఖేష్, సునీల్ శనివారం సాయంత్రం సందర్శించారు. డ్వాక్రా సంఘాల ఆర్థిక లావాదేవీలు, ప్రగతికి తీసుకుంటున్న చర్యలను మండల సమాఖ్య అధ్యక్షులు పొన్నాడ జనని, ఉపాధ్యక్షులు దుర్గ, కోశాధికారి సీతమ్మ వారికి వివరించారు. సాక్ష్యం సెంటర్ పనితీరును పరిశీలించారు. స్వయంసహాయక సంఘ సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించే విధానంపై క్లుప్తంగా వీడియో షూట్ చేశారు. వీడియో షూట్‌ను ప్రధానమంత్రి కార్యాలయానికి పంపిస్తామని తెలిపారు. ఏపీడీ సావిత్రి, వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ ఆదియ్య, వెలుగు ఏపీఎంలు అనురాధ, శ్రీనివాస్, సూర్యనారాయణ, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న వైద్యులు

- కోల్‌కతా ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనపై పెల్లుబికిన నిరసన
- దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- కొవ్వొత్తుల ర్యాలీ, మానవహారాలతో నిరసన



శృంగవరపుకోట: ఎస్.కోటలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న వైద్యులు



గజపతినగరం: నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ చేస్తున్న గజపతినగరం ఏరియా ఆస్పత్రి వైద్యులు,వైద్య సిబ్బంది



గజపతినగరం: గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడిన మరుపల్లి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది



గంట్యాడ: నిరసన తెలుపుతున్న గంట్యాడ పీహెచ్‌సీ వైద్యుడు వెంకటేష్, వైద్య సిబ్బంది



గుర్ల: నిరసన తెలుపుతున్న గుర్ల, తెట్టంగి పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది



చీపురుపల్లి: నిరసన తెలుపుతున్న చీపురుపల్లి సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది



లక్కవరపుకోట: నిరసన తెలుపుతున్న ఎల్.కోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది



కొత్తవలస: తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది



దత్తిరాజేరు: దత్తిరాజేరులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

శృంగవరపుకోట: ప్రాణాలు పోసే వారి ప్రాణాలకు రక్షణ లేదు. మాతృమూర్తుల మానానికి విలువ లేదు. రాక్షసరాజ్యంలో అమానవీయ ఘటనలు మళ్లీ మళ్లీ జరుగుతున్నా పాలకుల్లో స్పందన లేదంటూ వైద్యులు భగ్గు మన్నారు. కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన లైంగిక దాడి, హత్య ఘటనను వ్యతిరేకిస్తూ ఐఎంఏ పిలుపు మేరకు శనివారం సాయంత్రం ఎస్.కోటలో స్థానిక వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, మెడికల్‌షాపుల యాజమాన్యాలు, వర్కర్లు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక దేవీ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పాటై మృతి చెందిన కోల్‌కతా వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యురాలిపై జరిగిన అమానుషం ఆమెకు మాత్రమే పరిమితం కాదని, ఇది యావత్ మహిళా లోకానికి జరిగిన అన్యాయం అని, మృతిచెందిన వైద్యురాలు మన కుటుంబ సభ్యురాలు అయితే అనే భావన అందరిలో కలగాలని వైద్యులు సత్యశేఖర్,త్రినాథరావు,వరలక్ష్మి, పద్మావతి, చారి తదితరులు అన్నారు. వీరికి ఎన్‌జీఓ సంఘ అధ్యక్షుడు జె.మురళి,యువత మద్దతు పలికారు.

గజపతినగరంలో...

గజపతినగరం: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన లైంగిక దాడి, హత్యపై గజపతినగరం ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది శనివారం నిరసన తెలిపారు. ఆస్పత్రిలో మూడు గంటల పాటు వైద్య సేవలు నిలిపివేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి, ఫ్లకార్డులు పట్టుకుని ఆస్పత్రి నుంచి స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. ఆస్పత్రి ఆర్ఎంఓ గౌరీరామలక్ష్మి, సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్, గైనకాలజిస్ట్ అరుణకుమారి మాట్లాడుతూ ట్రైనీ వైద్యురాలిపై లైంగిక దాడికి పాల్పడి, హత్య చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే మరుపల్లి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది వైద్యాధికారులు కె.పుష్పాంజలి, అనూజ్‌రాయ్ నిరసన తెలిపారు. పురిటిపెంట న్యూకాలనీలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నుంచి గజపతినగరంలోని నాలుగురోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు.

చీపురుపల్లిలో...

చీపురుపల్లి: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలు మృతికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించి, వైద్యసిబ్బందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) వైద్యులు కోరారు. వైద్యసిబ్బంది పట్టణంలో శనివారం నిరసన ర్యాలీ చేశారు.

కొత్తవలస, ఎల్.కోటలో..

కొత్తవలస/లక్కవరపుకోట: మండలంలోని ప్రభుత్వ,ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది ఎల్.కోట పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఎల్.కోట మండల కేంద్రంలో శనివారం నిరసన తెలిపారు. కొత్తవలసలో వైద్య సిబ్బంది మూడురోడ్ల జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. దోషులను వెంటనే శిక్షించాలని, వైద్యసిబ్బందికి ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని కోరుతూ తహసీల్దార్ నీలకంఠరావుకు వినతిపత్రం అందజేశారు.

గుర్లలో రాస్తారోకో..

గుర్ల: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గుర్ల, తెట్టంగి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శనివారం రాస్తారోకో చేసి తమ నిరసన తెలిపారు. ట్రైనీ వైద్యురాలిపై లైంగిక దాడి, హత్య చేసిన నిందితులను శిక్షించాలని నినాదాలు చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని గుర్ల, తెట్టంగి పీహెచ్‌సీలవె వైద్యాధికారు చెన్నయ్య, శ్రీధర్, స్వప్న, అఖిబ్ కోరారు.

గంట్యాడలో...

గంట్యాడ: ట్రైనీ వైద్యురాలిని అత్యాచారం, హత్య చేసిన కిరాతకులను కఠినంగా శిక్షించాలని గంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వైద్యసిబ్బందితో కలిసి శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యసిబ్బందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని కోరారు. ఎంసీహెచ్ఈఓ ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరులో..

దత్తిరాజేరు: మండల కేంద్రంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది శనివారం నిరసన తెలిపారు. ఆస్పత్రి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ దేవుళ్లతో సమానంగా భావించే వైద్యులకు రక్షణ కరువైందని అన్నారు. వైద్యురాలిపై లైంగిక దాడికి పాల్పడి, హత్యచేయడం అమానుషమని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలో టీడీపీ రగడ

- చీపురుపల్లి బాలుర హైస్కూల్‌లో ఎస్‌ఎంసీ ఎన్నికలో బలం లేకుండా గెలిచేందుకు ప్రయత్నాలు
- ఎన్నిక వాయిదా వేయాలంటూ ఉపాధ్యాయులు, పోలీసులపై ఒత్తిడి
- నిబంధనల ప్రకారం ఎన్నిక జరిపిన హెచ్‌ఎం



చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన వారితో వైఎస్సార్‌సీపీ నాయకులు



పోలీసులపై తిరగబడుతున్న టీడీపీ శ్రేణులు

చీపురుపల్లి: రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో టీడీపీ నాయకులు అలజడి సృష్టించారు. బలం లేకపోవడంతో ఉపాధ్యాయులను బెదిరించి, పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చి ఎన్నికల్లో తమదే పైచేయి అనిపించుకోవాలని ప్రయత్నించారు. జిల్లాలోనే అత్యధికంగా విద్యార్థులు కలిగిన చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నిక టీడీపీ నేతల ఓవరాక్షన్‌తో సాయంత్రం 4 గంటల వరకు జరిగింది. ఎస్‌ఎంసీ చైర్మన్‌గా గవిడి సురేష్, వైస్ చైర్‌పర్సన్ గా చిప్పాడ సూరమ్మ ఎ న్నికయ్యారు. ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు 23 మంది సభ్యులు హాజరుకాగా, అందులో గవిడి సురేష్‌కు 20మంది మద్దతు తెలిపారు. ఆయనపై చైర్మన్ అభ్యర్థిగా పోటీకి దిగిన రౌతు పాపాయమ్మకు ఆమె మద్దతు మాత్రమే లభించింది. మరో ఇద్దరు సభ్యులు ఎవరి వైపు చేతులు ఎత్తలేదు.

అసలేం జరిగిందంటే...

ఈనెల 8న జరగాల్సిన ఎన్నికను టీడీపీ నేతల ఒత్తిడితో హెచ్‌ఎం చంద్రశేఖర్ వాయిదా వేయాల్సి వచ్చింది. తీరా శనివారం నిర్వహించిన ఎన్నికల్లో కూడా టీడీపీ నాయకులు అదే పంథా కొనసాగించేందుకు ప్రయత్నించారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రతీ తరగతిలోనూ ఎస్‌ఎంసీ సభ్యుల ఎన్నిక ముందుగా నిర్వహించారు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు సభ్యులను విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్నారు. దీంతో 24 మంది సభ్యులు ఎన్నికయ్యారు. వారంతా కలిసి ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. 20 మందికి పైగా సభ్యులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే ఉన్నారని తెలుసుకున్న టీడీపీ నేతలు ఎలాగైనా చైర్మన్ ఎన్నిక అడ్డుకోవాలని ప్రయత్నించారు. దీంతో వైఎస్సార్‌సీపీ,టీడీపీ వర్గీయుల మధ్య స్వల్ప వివాదం నెలకొంది. ఎస్‌ఐ కిరణ్‌కుమార్ నాయుడు ఇరువర్గాలకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఆయనపై కూడా టీడీపీ కార్యకర్తలు తిరగబడ్డారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ ఎ.ఎస్.చక్రవర్తి అక్కడికి చేరుకుని పాఠశాల ప్రాంగణం నుంచి అందరినీ బయటకు పంపించి ఎన్నికలు జరిపించారు. ఏఎంసీ స భ్యులకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ అభినందనలు తెలిపారు.

హామీలు నెరవేర్చలేని స్థితిలో కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

దత్తిరాజేరు: సూపర్ సిక్స్‌తో పాటు అనేక హామీలు ఇచ్చి టీడీపీ,జనసేన,బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిందని, ఆహామీలను నెరవేర్చలేని స్థితిలో ప్రభుత్వం ఉందని వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ మహదేవ్ ఫణీంద్రుడు నివాసం వద్ద వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున అధ్యక్షతన పార్టీ ముఖ్యనాయకులు, సర్పంచ్ లు, ఎంపీటీసీల సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎంపీ బెల్లాన మాట్లాడుతూ మంత్రి లోకేష్ రెడ్‌బుక్ చూపించి అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహంపై దాడి, రాష్ట్ర వ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాల ధ్వంసం, అరాచకాలు తప్ప కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. రాష్ట్రంలో చిన్నారులపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అరాచకాలను ఎదిరించాలి

మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ గ్రామాల్లో టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను ఎదిరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులకు సూచించారు. ఓటమి చెందినంత మాత్రాన కార్యకర్తలు, నాయకులు అధైర్యపడాల్సిన పనిలేదన్నారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి , తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బొత్సకు శుభాకాంక్షలు



వేపాడ: ఎమ్మెల్సీ బొత్సకు శుభాకాంక్షలు తెలుపుతున్న మండల ప్రజాప్రతినిధులు, నాయకులు



బొండపల్లి: ఎమ్మెల్సీ బొత్సకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బొండపల్లి: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణను మండల ప్రజాప్రతినిధులు, నాయకులు విశాఖలో శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గజపతి నగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, సీనియర్ నాయకులు బి.వి.ప్రభుజీరాజు, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

వేపాడ: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, వైస్ఎంపీపీ అడపా ఈశ్వరరావు తదితరులు శనివారం విశాఖలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు



చీపురుపల్లిరూరల్(గరివిడి): అర్తమూరు పాఠశాల చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ గౌరి, కమిటీ సభ్యులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): వెదుళ్లవలస పాఠశాల చైర్మన్ శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్ సుగుణ, కమిటీ సభ్యులు

గుర్ల: మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం నిర్వహించిన ఎస్‌ఎంసీ(స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈనెల 8న తొలిసారి ఎన్నికలు నిర్వహించగా వివిధ కారణాల వల్ల వాయిదా పడిన సంగతి తెలిసిందే. పాలవలస, పెద్దబంటుపల్లి ఉన్నత పాఠశాలల ఎస్‌ఎంసీ చైర్మన్‌లుగా పొట్నూరు పాపినాయుడు, రెల్లి రాంబాబు ఎన్నికయ్యారు. విజేతలకు వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈరెండు పాఠశాలల్లో అధికారుల ఒత్తిడితో ఏలాగైనా ఎన్నికలను మరోమారు వాయిదా వేయించేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించినప్పటికీ వారి పాచికలు పారలేదు. పకీరు కిట్టాలి, గూడెం, కలవచర్ల పాఠశాలల్లో ఎలాంటి ఘర్షణ లేకుండా ఎన్నికలు జరిగాయి.

గరివిడి మండలంలో..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని పలు పాఠశాలల్లో ఇటీవల వాయిదా పడిన ఎస్‌ఎంసీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. అర్తమూరు ఉన్నత పాఠశాల చైర్మన్‌గా బూడి శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ గా గోక గౌరి, వెదుళ్లవలస ఉన్నత పాఠశాల చైర్మన్‌గా మన్నెపురి శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్‌గా ఎత్తుల సుగుణ ఎన్నికయ్యారు. కందిపేట పాఠశాలలో స్థానిక టీడీపీ నాయకుల తీరువల్ల ఎన్నికలు మరోమారు వాయిదా పడ్డాయి. అర్తమూరు, వెదుళ్లవలస పాఠశాలల చైర్మన్‌లు, వైస్ చైర్‌పర్సన్‌లుగా ఎన్నికైన వారికి అర్తమూరు సర్పంచ్ పొన్నాడ కుమార్,ఎంపీటీసీ పతివాడ గురినాయుడు,వెదుళ్లవలస సర్పంచ్ గుడివాడ తమ్మినాయు డు,వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

4 స్కూళ్లలో ఏకగ్రీవం, ఒక చోట వాయిదా...

మెరకముడిదాం: వివిధ కారణాలతో మండలంలోని అయిదు పాఠశాలలకు ఇటీవల వాయిదా పడిన ఎస్‌ఎంసీ ఎన్నికలను శనివారం నిర్వహించారు. సాతాంవలస హైస్కూల్ చైర్ పర్సన్‌గా సిర్లి మంగ మ్మ, సాతాంవలస ప్రాథమిక పాఠశాల చైర్ పర్సన్‌గా ఎస్.వెంకటలక్ష్మి, ఉత్తరావల్లి హైస్కూల్ చైర్మన్‌గా పల్లి సత్యనారాయణ, ఉత్తరావల్లి ప్రాథమిక పాఠశాల చైర్‌పర్సన్‌గా పడాల ఎర్రమ్మ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. భీమవం ప్రాథమిక పాఠశా లలో కోరం చాలక ఎన్నిక వాయిదా పడిందని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు.

చీపురుపల్లి మండలంలో..

చీపురుపల్లి: మండలంలోని పలు పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. రామలింగాపురం పాఠశాల ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్‌గా ఇప్పిలి రాము, ఆర్థివలస పాఠశాల చైర్మన్‌గా మహాలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చీపురుపల్లి బాలికోన్నత పాఠశాలతో పాటు మండలంలోని గుణిదాం పాఠశాలలో ఎన్నికలు వాయిదా పడ్డాయి. రామలింగాపురం, ఆర్థివలస పాఠశాలల చైర్మన్లగా ఎన్నికైన వారిని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాల నాయుడు, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ అభినందించారు.

సంక్షిప్తంగా...

ఎండిన నారుమడుల పరిశీలన



కల్లేపల్లిలో ఎండిపోయిన వరినారుమడిని పరిశీలిస్తున్న ఏఓ స్వాతికుమారి

లక్కవరపుకోట: మండలంలోని కల్లేపల్లి,రేగ,తామరాపల్లి,చందులూరు తదితర గ్రామాల్లో తీవ్ర వర్షాభావంతో దెబ్బతిన్న వరి నారుమడులను ఏఓ స్వాతికుమారి శనివారం పరిశీలించారు. నారుమడులను వర్షాభావ పరిస్థితుల నుంచి కాపాడుకునే పద్ధతులను రైతులకు వివరించారు. నారు పూర్తిగా తడిచేలా మల్టీకే ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. ఆమె వెంట పలువురు వీఏఏలు ఉన్నారు.

బ్యాగుల పంపిణీ



విద్యార్థినులకు బ్యాగ్‌లు అందజేస్తున్న హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు

శృంగవరపుకోట: ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలోని ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థి నులకు ప్రభుత్వం సరఫరా చేసిన బ్యాగులను హెచ్‌ఎం బి.ఉమామహేశ్వరరావు శనివారం పంపిణీ చేశారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

దశపర్ణి కషాయం తయారీపై అవగాహన

గజపతినగరం రూరల్: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా శ్రీరంగరాజుపురం గ్రామంలో గజపతినగరం వ్యవసాయశాఖ సహాయ సంచాల కు లు మహరాజన్, ఏఓ ధనలక్ష్మి ఆధ్వర్యంలో రైతులకు దశపర్ణి కషాయం తయారీపై శనివారం అవగాహన కల్పించారు. అంతకుముందు వరి పంటను ఈ–క్రాప్‌లో నమోదు చేయించారు.ఆర్బీఎల్‌లు ప్రకాష్, హేమసుందర్, వీఏఏ వినయ్ పాల్గొన్నారు.

పీఈటీలకు శిక్షణ

గుర్ల: పాఠశాలల్లో విద్యార్థులతో రోజూ వ్యాయామం చేయించాలని, వ్యాయామంలో మెలకువలు నేర్పాల్సిన బాధ్యత పీఈటీలపై ఉందని ఎంఈఓ -2 శ్రీనివాసరావు అన్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాల వ్యాయామ ఉపాధ్యాయులకు మండలంలోని గుజ్జింగివలస ఉన్నత పాఠశాలలో శనివారం శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ-2 మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

పాఠశాలల సందర్శన

జామి: మండలంలోని చింతాడ,జాగరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ-2 గంగరాజు శనివారం సందర్శించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటలను, విద్యార్థుల వర్క్‌బుక్స్, టీచర్ల లెసన్ ప్లాన్‌లను పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. జాగరం యూపీ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

ప్రకృతివ్యవసాయమే మేలు

శృంగవరపుకోట: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే మేలని ఏఓ కె.రవీంద్ర అన్నారు. మండలంలో వినాయకపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవ సాయంలో భాగంగా శనివారం క్షేత్ర సందర్శన నిర్వహించారు. వరి పొలాల్లో కాలిబాటలను పరిశీలించిన తర్వాత ఆయన రైతులకు పంచ పత్ర కషాయం తయారీపై అవగాహన కల్పించారు. వీఏఏ రవిచంద్ర, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

ఓటుహక్కు కల్పించండి

గజపతినగరం రూరల్: గ్రామాల్లో పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత బీఎల్‌ఓలపై ఉందని తహసీల్దార్ రత్నకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో బీఎల్‌ఓలతో శనివారం సమావేశం నిర్వహించా రు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మృతి చెందిన ఓటర్లను, అలాగే రెండుచో ట్ల ఓటుహక్కు కలిగిన ఓటర్లను గుర్తించి జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల డీటీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.